సూత్రధారి

(1988)

సాయంకాలం ఆరు గంటల సమయం. కళామందిరం ఆవరణంతా రంగురంగుల దీపాలతో కళకళలాడి పోతోంది. వచ్చే జనంతోనూ వాహనాలతోనూ ఆ ప్రాంగణమంతా సందడిగా వుంది.

ఆ రోజు రాఘవయ్య నటించి. దర్శకత్వం వహిస్తున్న 'సూత్రధారి' నాటకం ప్రదర్శింపబడుతోంది!

రాఘవయ్య మహానటుడు– అంతకు మించిన గొప్ప దర్శకుడు– తన తొమ్మిదో ఏటనే ముఖానికి రంగేసుకుని స్టేజెక్కిన రాఘవయ్య విభిన్న పాత్రలను పోషించి మంచి నటుడన్న బిరుదును సంపాదించుకుని. దర్శకత్వం కూడా చేపట్టి అంతకు మించిన ఖ్యాతిని గడించుకున్నాడు. సుమారు నాలుగున్నర దశాబ్దాల పాటు నాటక రంగానికి ఎనలేని సేవ చేసి. రత్నాల వంటి నటుల నెందర్నో తయారు చేసిన ఘనత ఆయనకే దక్కింది–

వెయ్యో ప్రదర్శన లిచ్చిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులూ, శిష్యులూ యీ రోజు ఆయనను సత్కరించాలనుకున్నారు– అదే హడావుడి! ఆంధ్రదేశంలో ఎక్కడెక్కడో వృత్తిరీత్యా స్థిరపడి పోయిన ఆయన శిష్యగణమంతా తరలి వచ్చింది–

హాలంతా కిటకిట లాడిపోతోంది!

అందరి మనస్సుల్లోనూ ఎప్పుడెప్పుడా అన్న ఆత్రుతే!

సరిగ్గా అదే సమయంలో వెనుక గ్రీన్‌రూంలో వున్న నటీనటులందరి ముఖాల్లోనూ ఆందోళన– కొందరిలో ఆశ్చర్యం. ఏం జరిగింది? అసలేం జరిగింది? అందరిలోనూ అదే ప్రశ్న!

ఆనాటి సభకూ నాటకానికీ సూత్రధారి అయిన రాఘవయ్య యింకా రాలేదు! అది నమ్మశక్యం కాని విషయం!

పంక్చువాలిటీని తప్పని సరిగా పాటించే రాఘవయ్య ఈనాడిలా రాకపోడం- అందరికీ ఆశ్చర్యాన్నే కలిగిస్తోంది- ఇలా ఎన్నడూ జరగ లేదు- ఉదయమే నటీనటులందర్నీ కలిసి చెప్పవలసిన విషయాలన్నీ చెప్పాడాయన-

నటీనటులంతా ఆయన చెప్పిన వేళకే వచ్చి తమ తమ పనులు ముగించుకుని ప్రదర్శనకు సిద్ధంగా వున్నారు. కానీ.....

అరగంట క్రితం రాఘవయ్య యింటికి కబురు చేస్తే ఆయన అప్పటికే బయల్దేరినట్టు తెల్సింది- బయల్దేరినాయన మరి ఎక్కడకు వెళ్ళినట్టు? మధ్యలో ఏమైనట్టు?

కార్యకర్తల్లో కూడ ఆందోళన మొదలైంది- ఏది ఏమైనా నాటకం ప్రదర్శించి తీరాల్సిందే అనే నిర్ణయాని కొచ్చారంతా. రాఘవయ్య వెయ్యాల్సిన వేషానికి మరో వ్యక్తిని అప్పటి కప్పుడు సిద్ధం చేశారు. నాటకంలోని ఏ పాత్రధారి అయినా కారణాంతరాల వల్ల రాకపోతే మరొకరు ఆ పాత్రను పోషించడానికి సిద్ధపడాలి అనే వారు రాఘవయ్య. ఆ రకమైన తర్ఫీదు తన యూనిట్ లోని నటీ నటుల కిచ్చారాయన.

ప్రస్తుత నాటకంలో మొదటి యిరవై నిముషాల్లోనూ రాఘవయ్య పాత్ర స్టేజి మీదికిరాదు- ఆలోగా ఆయన వస్తేసరి, లేదూ నాటకం సజావుగానే సాగిపోతుంది- ఆమేరకు నిర్ణయం తీసుకున్నా రాఘవయ్య కోసం అంతా ఎదురు చూస్తూనేవున్నారు.

కర్టెన్ లాగే కనకారావు దృష్టంతా మెయిన్ ఎంట్రెన్స్ వేపే వుంది. రాఘవయ్య ఏ సమయంలో నైనా రావచ్చనే నమ్మకం అతని కుంది- అతని మనసులో ఒకనాటి అనుభవం తళుక్కున మెరిసింది-

ఓ మారు నాటక పోటీలకు ఒక నాటకాన్ని తీసుకువెళ్ళారు రాఘవయ్య- నాటకం సరిగ్గా ఆరున్నరికి ప్రారంభించాల్సి వుంది. కానీ

ఆ టైంకి హాలు సగమే నిండింది- న్యాయ నిర్ణేతలు కూడా ఇంకా రాలేదు. అయినా సరిగ్గా ఆరున్నర గంటలకు తెర లేచింది- నాటకం మొదలయ్యింది- దాంతో హాలు బయట పిచ్చాపాటీ వేస్తున్న ప్రేక్షకులు పరుగున లోపలికి వచ్చారు- ఆ హడావుడికి ఎక్కడో కబుర్లు చెప్పుకుంటున్న న్యాయ నిర్ణేతలు కూడ లోపలికి వచ్చారు-

అప్పటికి కొంత నాటకం జరిగింది- జరుగుతున్న నాటకాన్ని అక్కడ ఆపేసి, తెరదించి, న్యాయ నిర్ణేతలు ఆలస్యంగా వచ్చిన కారణంగా వారికోసం నాటకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి ఆ వెంటనే ప్రారంభించాడు రాఘవయ్య.

హాలంతా చప్పట్లతో మార్మోగి పోయింది- న్యాయ నిర్ణేతలను ద్దేశించి ఎవరో 'షేమ్ షేమ్' అని అరిచారు కూడా.

అది న్యాయ నిర్ణేతల పాలిట చెంప దెబ్బ అయింది.

అనుకున్న సమయానికి అనుకున్నట్టు ప్రదర్శనలను ప్రారంభించక పోవడం కూడా నాటకాల పట్ల ప్రజలకు విముఖత ఏర్పడటానికి కారణం కావొచ్చు అనేవారు రాఘవయ్య. అటువంటి ఆయనే పంక్చువాలిటీని పాటించక పోవడం కనకారావు కీఆశ్చర్యాన్ని కలుగజేసింది-

ప్రదర్శన ప్రారంభించడానికి మరో పది నిముషాలే వ్యవధి వుంది- రాఘవయ్య కోసం వెళ్ళిన నలుగుర్లోనూ యిద్దరు తిరిగొచ్చారు తమ కెక్కడా ఆయన కన్పించలేదని.

కొందరిలో అప్పుడే నిరాశ ఏర్పడి పోయింది- నాటకంలో ఆయన పాత్రను వేయబోయే సలీమ్ మాత్రం మేకప్ ముగించుకుని పూర్తిగా సన్నద్ధుడయ్యాడు-

అతనిలోని ఆలోచనలు కూడ ఒక్క మారు గతంలోకి తొంగి చూశాయి-

ఓ మారు రాఘవయ్య దర్శకత్వంలోని ఒక నాటకంలో సలీమ్‌కి కూడ ఒక పాత్ర యివ్వడం జరిగింది- అది ఏదో ఒక సంస్థకోసం టిక్కెట్టుపై వేసే నాటకం- రిహార్సల్స్ అన్నీ సక్రమంగానే జరిగాయి- తీరా నాటకం ప్రదర్శించే రోజుమధ్యాహ్నం బాత్రూంలో జారి పడ్డాడు సలీమ్, కుడికాలు ఫ్రాక్చరైంది- ఆ సంగతి సకాలంలో రాఘవయ్యకు అందలేదు-

మరో మనిషి కూడ సమయానికి లేక పోవడంతో, అప్పటికప్పుడు నాటకాన్నిమార్పు చేసి. సలీమ్ వేసే పాత్రనే నాటకంలోంచి తప్పించి వేశాడు రాఘవయ్య- అటువంటి సమయస్ఫూర్తి, ధైర్యం అతని నుండి నేర్చుకోవలసిందే.... ఏనటుడైనా!

రాఘవయ్య తన శిష్యులకు నటనతో పాటు చాల విషయాలు నేర్పేవాడు- ఆయన శిష్యుల్లో 'ఉత్తమ నటుడు' బహుమతులందుకున్న వారూ వున్నారు. సినీ నటులైన వారూ వున్నారు- రంగాలంకరణలో ప్రావీణ్యతను సంపాదించుకున్న వారూ వున్నారు- సింప్లిసిటీ వంక్చువాలిటి నుండినటన, డైలాగ్ డెలివరీ. మాడ్యులేషన్ వరకూ ఎందరో ఆయననే ఆదర్శంగా పెట్టుకున్నారు-

సరిగ్గా ఏడు గంటలకు తెర తొలిగి నాటకం అనుకున్న వేళకి మొదలయ్యింది- అయితే రాఘవయ్య రాలేదన్న సంగతి అప్పుడే కొంత మంది ప్రేక్షకులు పసిగట్టేశారు- తెల్సిన కొద్దిమందీ ఎంతో నిరుత్సాహపడ్డారు-

అయితే 'సూత్రధారి' నాటకం మలచిన తీరు. అందులోని పాత్రల సహజ ప్రవృత్తి. కథలోనూ కథనంలోనూనిండుగా తొణికిసలాడే జీవం. అక్కడి ప్రేక్షకుల్ని అతి స్వల్ప కాలంలోనే ఆకట్టుకుని సమ్మోహితుల్ని చేశాయి. అంచేత నాటకంలో లీనమైపోయిన వారికి రాఘవయ్యలేదన్న సంగతి గుర్తు రాకుండా పోయింది-

ఐతే, నాటకం మొదలైన కొంత సేపటికి హాల్లోకి వచ్చి ఓ మూలన కూర్చున్న రాఘవయ్యను ఎవరూ గుర్తించలేదు.

నాటకం చివరి అంకం ప్రదర్శింప బడుతూండగా కార్యకర్త లెవరో ఆయనను చూశారు.

అంతే

వారిలో హడావుడి మొదలైంది-

ఎవరెన్ని ప్రశ్నలు కుప్పించినా నాటకం పూర్తయ్యే వరకూ ఒక్క మాట కూడ మాట్లాడలేదు రాఘవయ్య- అందరికీ కళ్ళతోనే సమాధానం చెప్పేడు.

నాటకం పూర్తయిన మరుక్షణం సన్మాన కార్యక్రమం కోసం రాఘవయ్యని వేదికమీదికి ఆహ్వానించేరు-

హాల్లో వున్న ప్రేక్షకులు రిధమిక్‌గా చప్పట్లు కొట్టడం మొదలు పెట్టారు- కొందరిలో ఆనందం- మరికొందరిలో ఆశ్చర్యం!

ఏ భేషజాలూ లేకుండా అతి సాధారణంగా మైకు ముందు కొచ్చాడు రాఘవయ్య. ఒక్కమారు హాలంతా కలయజూసి," ప్రేక్షక మహాశయులకూ, గౌరవ కార్యకర్తలకూ నా నమస్సుమాంజలులు" అని, ఒక్క క్షణం ఆగేడు-

హాలంతా నిశ్శబ్దమై పోయింది- అందరిదృష్టీ రాఘవయ్య మీదే వుంది-

"ఇంతమంది మిత్రుల్నీ, అభిమానుల్నీ, శ్రేయోభిలాషుల్నీ చూస్తుంటే నా కడుపు నిండిపోతోంది. నా మీద మీకున్న అపారమైన అభిమానం వల్లనైతేనేమి, ప్రేమ వల్లనైతేనేమి నాకీ సన్మాన కార్య క్రమాన్ని తలపెట్టేరు- అందుకు ఎంతో కృతజ్ఞుడిని- అయితే నేనీ నాడు యీ సన్మానాన్ని స్వీకరించ లేకపోతున్నాను- అందుకు మీరు నన్ను క్షమించాలి" అన్నాడు.

"ఒప్పుకోం. మీరు సన్మానాన్ని స్వీకరించాల్సిందే!" హాల్లో వెనకెక్కడో అరుపులు విన్పించాయి-

అటు తిరిగి రెండు చేతులూ జోడించాడు రాఘవయ్య.

"నాకు తెల్సు- నా యీ నిర్ణయం నా అభిమానులకి నిరుత్సాహాన్ని కలిగిస్తుందని- కానీ నా కారణాలు నాకున్నాయి. వాటిల్లో కొన్నయినా మీ ముందుంచడానికి ప్రయత్నిస్తాను.

కళపట్ల, నాటక రంగంపట్ల నా కెంత గౌరవముందో నాకంటే నన్ను తెల్సినవారికే ఎక్కువ తెల్సు- నటుడికి నిజాయితీ, చిత్తశుద్ధి, దీక్ష అవసరమని నమ్మే వాడిలో నే నొకడిని- వాటిని మించి పంక్చువాలిటీ! నా యూనిట్ లో పనిచేసే వారికి నేను నిరంతరం బోధించే నీతిప్రబోధాలే అవి-

నాటకమన్నది ఒక జీవకళ-

మనకు తెలిసిన మనుషులే మనముందు మన సమస్యల్లోనూ, ఆలోచనా పరిధుల్లోనూ మనలోని విభిన్న మనస్తత్వాలకూ వ్యక్తిత్వాలకూ ప్రతీకలుగా నిలుస్తూ. నటిస్తూ మన జీవితాల్నే ప్రతిబింబింప జేసే కళ యిది-

జీవితాల్ని చూపించడమే కాక జీవితం సక్రమ మార్గంలోకి ఎలా వెళ్ళాలన్నదీ నాటకం బోధించగలగాలి- రచయిత తన మేధాశక్తితో చూపే పరిష్కార మార్గాల్ని, మార్గదర్శక సూత్రాల్ని నటుడు ఏ ఆలోచనలూ ఏ విద్యా లేని అతి సామాన్యుడికి సైతం అందివ్వగలగాలి- అప్పుడే యీ కళకు సార్థకత్వం.

నాటకంకంటె జీవితాన్ని విస్తృత పరిధిలో చూపించ గలిగే చలన చిత్రాలొచ్చాయి. ఇంతకంటే ఎక్కువ ప్రాచుర్యాన్ని ప్రజాదరణనీ గడించాయి. అయితే నే చెప్పిన ప్రయోజనం, సార్థకతల

దృష్ట్యా అవి నాటకాల కంటే వెనుకబడి వుంటున్నాయని నా అభిప్రాయం. కొద్ది మంది ప్రముఖ దర్శకులు మాత్రం యీ సినీమాలను ఉత్తమ కళాఖండాలుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారు- అటువంటివి బహు తక్కువ. ఎక్కువ భాగం పలాయన వాదం, పైపై మెరుగులూ గల కమర్షియల్‌గా డబ్బు చేసుకునే సినీమాలే- అలా అని ప్రేక్షకులలో నాటకాల పట్ల అభిరుచి వున్న వారూ లేకపోలేదు- అటువంటి వారి కోసమైనా కొన్ని నాటక సమాఖ్యలు, సమాజాలూ వుండక తప్పదు-

పోతే.... ఈ రోజు నా వెయ్యో నాటక ప్రదర్శనను చూడాలనుకున్న వారికీ చాల నిరుత్సాహాన్ని కలిగించాను. నేను ఆలస్యంగా రావటానికి గల కారణాలేమైనా ఒక నటుడిగా, దర్శకుడిగా నాటక రంగం నుండి విరమించ దల్చుకున్నాను-"

అంతవరకూ చెప్పి ఆగేడు రాఘవయ్య-

సభలో కలకలం మొదలయ్యింది-

"మా కోసమైనా మీరు మీ నిర్ణయాన్ని ఉపసంహరించు కోక తప్పదు" అన్నారో అభిమాని ముందు సీట్లోంచి లేచి-

సభలో పెద్దపెట్టున గందరగోళం ఏర్పడింది-

వారిని వారిస్తూ రాఘవయ్య యిలా అన్నాడు-

"కేవలం నటుడిగా దర్శకుడిగానే నాటకరంగం నుండి విరమిస్తున్నాననే అన్నాను గాని నాటక రంగానికి దూరమౌతా'నని నేనన లేదు- ఆ మాట నాలో జీవమున్నంత వరకూ నా నోట రాదు- అంచేత ఆంధ్రదేశానికీ నాటక రంగానికీ మంచి నటుల నందించే ప్రయత్నంలో నా శేష జీవితాన్ని గడప దల్చుకున్నాను"

ఆ మాటలకు సభలో హర్షధ్వానాలు చెలరేగేయి.

మరుక్షణంలో నాలుగైదు కాగితం ముక్కల్ని ఎవరెవరో

స్టేజి మీదికి తెచ్చి అతనికందించారు- వాటిపై రాసి పంపిన విష యాన్ని చదివి, ఒక్కక్షణం ఆలోచించి గొంతు సర్దుకున్నాడు రాఘవయ్య.

"నాయీ నిర్ణయం వెనుక నుండే అసలైన కారణాన్ని చెప్పమని నా అభిమానులు కొందరు కోరుతున్నారు- వారికోసం కాకపోయినా అసలు కారణాన్ని ఒక బాధ్యత గల నటుడిగా మీకు తెలియపరచాలనే అనుకుంటున్నాను- నా మీద అభిమానమున్న ప్రతి ఒక్కరూ నేను చెప్పేది చివరి వరకూ వినాలని కోరుకుంటున్నాను." అంటూ గొంతుస్థాయి తగ్గించి చెప్పడం మొదలు పెట్టేడు రాఘవయ్య.

హాలంతా నిశ్శబ్దంగానే వుంది-

"నా జీవితంలో ఈ రోజుని నేనెన్నటికీ మరచిపోలేను- ఎప్పుడో.... యే అభిప్రాయాలూ ఆశయాలూ లేని తొమ్మిదో యేట ముఖానికి రంగు పూసుకొని స్టేజి ఎక్కినప్పటికీ, ఆ తర్వాత పెరిగిన పట్టుదల వల్లనైతేనేమి, గర్వం, కీర్తి కండూతి వల్లనైతేనేమి; నటుడిగా జీవితంలో స్థిరపడ్డాను. అయితే నా జీవితానికో మలుపునిచ్చి, నా నట జీవితానికి కలికితురాయి అయిందీ 'సూత్రధారి' నాటకం- ఏ వ్యక్తి కారణంగా నేను నటుడిగా ముందడుగు వేశానో! ఏ నటుడి పతనాన్ని చూసి మనసు చలించి ఆయన జీవిత యితివృత్తాన్ని ఆధారంగా జేసుకుని యీ 'సూత్రధారి' అన్న నాటకాన్ని ఓ గొప్ప రచయిత చేత రాయించుకుని తెలుగుదేశంలోకి ఓ మంచి నాటకాన్ని తెచ్చానో.... ఆ వ్యక్తి సరిగ్గా పదేళ్ళ తర్వాత అనుకోని విధంగా నాకీరోజు దర్శనమిచ్చాడు-"

ఒక్క క్షణం ఆగి, ప్రేక్షకుల వంక చూశాడు రాఘవయ్య. అంతా ఆయన వంకే చూస్తూ ఆయన చెప్పే విషయంలో ఆతృతని కనబరుస్తున్నారు.

"మీలో ఎందరికి గుర్తుందో....సరిగ్గా పాతికేళ్ళ క్రితం గౌరీనాథం అనే ఆయన నాటకాల్లో హీరో వేషాలు వేసేవాడు- అందంగా ఆరడుగుల పొడవుగా వుండి ఏ పాత్రలోనైనా రాణించేవాడు. పాత్రకి సహజత్వాన్ని తెచ్చేవాడు- గౌరీనాథం నాకు మిత్రుడే కాదు నాటక రంగంలో గురువు కూడ. ఎంతటి వారికైనా ఏదో ఒక బలహీనత వుండి తీరుతుందేమో.... అటు పౌరాణికాల్లోనూ, యిటు సాంఘిక నాటకాల్లోనూ అవలీలగా నటించగల గౌరీనాథం సినిమా పిచ్చిలో పడి పోయాడు- ఎవరు ఏ రకంగా ఆశ చూపారో.... చేస్తున్న ఉద్యోగానికి తిలోదకాలిచ్చేసి, మద్రాసెళ్ళిపోయాడు- వెళ్ళే ముందు నన్ను కలిస్తే అన్ని విషయాలూ వివరంగానే మాట్లాడాను- అతన్ని ఆపడానికే ప్రయత్నించాను. కానీ ఆనాడతను అన్న మాటలు నాకిప్పటికీ గుర్తున్నాయి.

"గొర్రె తోకలాంటి యీ ఉద్యోగాన్నీ, ఎండమాని లాంటి యీ నాటకరంగాన్నీ నమ్ముకుని ఎన్నాళ్ళిలా వుండిపోమంటావ్ రాఘవా.... అదృష్టం కలిసొచ్చిందా అక్కడ నిలదొక్కుకుని అటు డబ్బులూ యిటు కీర్తిప్రతిష్టలూ దండిగా ఆర్జించగలను- మీ వంటివారికి సహాయపడి మార్గం చూపించగలను." అన్నాడు.

భవిష్యత్తులోకి వేసుకున్న మార్గాలు మనమనుకున్నంత సుగమంగా వుండవేమో!

వెళ్ళిన కొద్ది రోజుల్లోనే అక్కడి వారు అతని దగ్గరున్న సొమ్ము కాశపడి అరచేతిలో వైకుంఠాన్ని చూపించేరు. చెంపమీద మచ్చ వుండటం వల్ల హీరోకి పనికిరావన్నారట- సైడు హీరో యిస్తామన్నారట- స్క్రీన్ టెస్టులు చేశారట-

ఆ వివరాలు రాస్తూ ఫోటోలు నాకు పంపేడు గౌరీనాథం. నిజంగా సంతోషించాను- ఆ సంగతే రాశాను.

అంతే! తర్వాత ఉత్తరాలు లేవు. నేను రాసిన ఉత్తరాలకి జవాబులు లేవు. విడుదలైన వాటిల్లో అతను నటించిన సినిమాలూ లేవు వైకుంఠపాళీ లాంటి సినీ ప్రపంచంలో ఏపామో గౌరీనాథాన్ని మింగేసి వుంటుందని వూహించాను.

ఆ తర్వాత నాలుగేళ్ళకి కాబోలు మెడ్రాసులో మేమొక నాటకాన్ని ప్రదర్శించాల్సి వచ్చింది- నాటకమయ్యేక గ్రీన్ రూంలో కొచ్చి నన్ను ప్రత్యేకంగా అభినందించిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. నోట మాట రాలేదు. గుండెల్లోంచి దుఃఖం పొంగుకొచ్చింది

అతను గౌరీనాథం! మాసిన బట్టల్లో పెరిగిన గడ్డంతో పీక్కుపోయిన ముఖంతో పోల్చుకో లేనంతగా వున్నాడు. సినీమా ప్రపంచం తనను మోసం చేసిందని వాపోయాడు. తిరిగి రావటానికి ముఖం చెల్లక అక్కడే చిన్న పిల్లలకి ట్యూషన్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడట-

ఆ క్షణంలో అతను నాకంటికి మబ్బులు కమ్మేసిన సూర్యుడిలా కన్పించాడు. ఆ మాటే అతనితో అన్నాను.

"నీకేం తక్కువ గౌరీనాథం- ఇప్పటికైనా మించిపోయిందేం లేదు. మా యూనిట్‌లో నీకు తగిన స్థానం కల్పిస్తాను.రా, నిజమయిన నటుడిగా నీ ప్రజ్ఞను చాటు!" అన్నాను.

ఆ మాటకు గౌరీనాథం నవ్విన నవ్వు నాకిప్పటికీ గుర్తుంది. ఆ నవ్వులో విషాదమే వుంది.

'ఇంకెక్కడి నటన రాఘవా! నాలోని నటుడు శాశ్వతంగా చచ్చిపోయాడు' అన్నాడు.

ఆ మర్నాడంతా అతను నా అతిథ్యంలోనే వున్నాడు. అంతే! ఆ తర్వాత మళ్ళీనేను గౌరీనాథాన్ని చూడలేదు.

నాటికి మళ్ళీనేడు-

ఇక్కడకు రావడానికి ఆటో స్టాండు వైపు వెళ్తున్నాను—

అక్కడ జనం గుమిగూడి వున్నారు. నలుగురైదుగురు డబ్బులు దండుతున్నారు.

"అనాథ ప్రేత బాబూ. కలిగింది వెయ్యండి" అంటున్నాడొకడు.

"పాపం.... పిచ్చివాడండి— నవరసాల్నీ పోషిస్తూ అందరికీ వినోదాన్నిచ్చేవాడు. పిచ్చి కళాకారుడి శవదహనానికి తోచిన సాయం చేయండి బాబూ" అంటున్నాడింకొకడు. దారిన పోయే ఒక ముసలాయన ఆశ్చర్యంగా ఆగి,

"ఎవరూ? ఆ సినిమా పిచ్చోడా? పాపం.... ఆయువు తీరిపోయింది. ఘడియకో వేషం వేసేవాడు. రాముణ్ణనేవాడు. రావణాసురుడననే వాడు— హీరోననేవాడు. చెంపమీద మచ్చని చూపిస్తూ విలన్ని.... కాసుకో అనేవాడు. పాపం... ఎక్కడ పుట్టీ ఎక్కడ పెరిగాడో యిక్కడిలా యీ రోజు దిక్కుమాలిన...."

ఇక ఆపై మాటలు వినలేక అటువైపు నడిచి చూశాను. ఆ క్షణంలో నా శరీరమెందుకో వణికింది. నా చూపులు జనాన్ని తోసుకుంటూ శవం మీదికి వెళ్ళాయి. నా అనుమానం నిజమైంది. గుర్తుపట్టలేని విధంగా వున్న ఆ జీవంలేని శరీరం గౌరీనాథానిది!

అతని గుండెల మీద ఓ నీలం రంగు సిల్కు కోటు వుంది. ఆ కోటుకి రెండు రంగు వెలిసిన మెడల్సు తగిలించి ఉన్నాయి. నా మనసు పిండినట్లయింది. అందులో ఒక మెడల్ చరిత్ర నాకు తెల్సు. గౌరీనాథం నటనకు ఆనాటి జిల్లా కలెక్టర్ అతని కోటుకు స్వయంగా తగిల్చినది!

హాల్లోని ప్రేక్షకులంతా కాలాన్ని కూడ లెక్కజేయకుండా మంత్రముగ్ధుల్లా వింటున్నారు. రాఘవయ్య గొంతు బొంగురుపోయింది.

"జీవితం కోసం నేను నటనను నేర్చుకున్నాను. అంతమాత్రాన జీవితంలో కూడా నటించేంతటి అధముణ్ణి కాను—

అభిమానపూర్వకంగా జరిగే యీ సన్మానం నా జీవితానికి గొప్పే- కానీ.... కొద్ది గంటల క్రితం నా మనసులో రేగిన ఘర్షణ నన్నొక్క- క్షణం ఆలోచించేలా చేసింది- ఆ క్షణంలో నాకు యీ సన్మానం కంటే.... నేను గౌరవప్రదంగా భావించుకునే నాటక కళ కంటే ఒక దిక్కు-లేని దగాపడ్డ నటుడే గొప్పగా కనిపించాడు- మాన వత్వమున్న మనిషిగా.సాటి నటుడుగా నా కర్తవ్యం నన్ను ముందుకు నడిపించింది.

ఏ ప్రభుత్వమూ, ఏ పరిశ్రమా. ఏ నాటక సమాజమూ ఏ నటుడూ చేయని పనిని మానవత్వమున్న కొందరు మనుషులుచేస్తూంటే స్నేహితుడినైన నేను తప్పించుకుని రాలేకపోయాను.

ఒకప్పుడు ఆంధ్రదేశం మెచ్చుకున్న నటుడు. ఒక గొప్ప నాటకం ఆవిర్భవించడానికి కారణభూతమైన వాడూ అయిన గౌరీనాథం అరగంట క్రితం పిడికెడు బూడిదగామారిపోయాడు.

ఏ నటుడికైతే మాత్రం ఏదిశాశ్వతం?

బిరుదులూ సన్మానాలూ ఎన్నాళ్ళు నిలుస్తాయి?

జీవితమనే నాటకరంగం మీద మన ఇచ్ఛలేకుండా కేవలం సూత్రధారి ఆజ్ఞానుసారం నటించే మనమంతా ఎప్పటికైనా కాలమనే అవనిక వెనుక మరుగవకతప్పదు.

కళాకారులూ, ధనవంతులూ, అధికారులూ, సామాన్యులూ- ఈ తేడాలన్నీ అంతవరకే!

ఆ నిజాన్ని తెల్సుకున్ననాడు మానవత్వంకంటే గొప్పదైనది మరొకటి కన్పించదు."

రాఘవయ్య గొంతు ఆర్ద్రమైంది.

అతని కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు!

కార్యకర్తలు మంత్రముగ్ధుల్లా నిల్చుండి పోయారు.

ప్రేక్షకుల నయనాల్లోనూ లీలగా నీళ్ళు!

ఒక్క- క్షణం మౌనంగా తలొంచి నిల్చుని ఆ తర్వాత వేదిక దిగి. కుర్చీలో కూలబడిపోయాడు రాఘవయ్య!